TEL:T/TG/2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954

పబ్లిషర్ : హైదరాబాద్ సంపుటి :01 సంచిక : 177 బుధవారం 19-02-2025 పేజీలు : 06 వేల : 05/-

## వర్సిటీల అభివృద్ధికి రూ.5 వేల కోట్లు కేటాయించండి

## ఇతర సమస్యలను పరిష్కరించండి

### -ముఖ్యమంత్రి రేవంత్‌కు సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ లేఖ




**హైదరాబాద్ (మన వెలుగు) ఫిబ్రవరి 18 :** రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల అభివృద్ధికి రూ.5 వేల కోట్లను కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వానికి... సీపీఐ (ఎం) విజ్ఞప్తి చేసింది. వర్సిటీల్లోని ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంగళవారం లేఖ రాశారు. రాష్ట్రంలోని 15 యూనివర్సిటీలలో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల నేను ఉస్మానియా యూనివర్సిటీ సందర్శించిన సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు, రీసెర్చ్ స్కాలర్స్ అక్కడి సమస్యలను నా దృష్టికి తీసుకువచ్చారు.యూనివర్సిటీలో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్స్తో పాటు బోధనేతర సిబ్బంది పోస్టులు ఖాళీలు భర్తీ చేయకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడంలేదు. కాంట్రాక్ట్ లెక్చరర్లు సుదీర్ఘకాలం కొనసాగిస్తున్నారు. నిధుల కొరత తీవ్రంగా ఉన్నది. ల్యాబ్ పరికరాలు, హాస్టల్స్, మెస్, స్పోర్ట్స్, ఇతర మౌలిక సదుపాయాల సమస్యలు కూడా ఎదుర్కొంటున్నారు. ఇటీవల హాస్టల్స్లో శ్లాబ్ పెచ్చులు ఊడిపడి విద్యార్థులు గాయపడ్డారు. వందేండ్ల చరిత్ర కలిగిన ప్రతిష్టాత్మక ఉస్మానియా యూనివర్సిటీకి న్యాక్ నేషనల్ అస్సెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ గుర్తింపులో వెనుకబడి ఉంది. యూనివర్సిటీల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలి. విశ్వవిద్యాలయాల భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. వీటిని పరిరక్షించేందుకు తగు చర్యలు తీసుకోవాలి. విద్యార్థినులపై వేధింపులు నిరోధించడానికి సుప్రీంకోర్టు మార్గదర్శకాలు అమలు చేయాలి. రాష్ట్రంలో ఒక్క స్కిల్ యూనివర్సిటీ కాకుండా ప్రతి యూనివర్సిటీని స్కిల్ యూనివర్సిటీగా మార్చేందుకు ప్రణాళికలు తయారు చేయాలి.డిమాండ్స్ : 1) యూనివర్సిటీలకు రు.5వేల కోట్లు, ప్రత్యేకంగా ఉస్మానియా యూనివర్సిటీకి రు.1000కోట్లు కేటాయించాలి. 2) యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలి. 3) నూతన భవనాలు నిర్మించాలి. మోడ్రన్ ల్కెబ్రరీ, సైన్స్ ల్యాబ్, రీసెర్స్ సెంటర్ ఏర్పాటు చేయాలి. 4) ప్రతి పిహెచ్డి విద్యార్థికి నెలకు రు.25వేలు ఫెలోషిప్ అందించాలి. 5) అన్ని యూనివర్సిటీలకు రీసెర్చ్ గ్రాంట్స్ అందించాలి. 6) పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను విడుదల చేయాలి. 7) కాంట్రాక్టు, పార్ట్ ట్కెం టీచర్ల వేతనాలు పెంచాలి. 8) విద్యార్థి సంఘం ఎన్నికలను నిర్వహించాలి. పై అంశాలను తమరు సానుకూలంగా పరిశీలించి యూనివర్సిటీలు ఎదుర్కొంటున్న పై సమస్యలను పరిష్కరించేందుకు తగు చర్యలు చేపట్టాలని సీఎంను జాన్‌వెస్లీ కోరారు.

## మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు



**హైదరాబాద్ ఫిబ్రవరి 18 :** మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ శుభవార్త చెప్పింది. ప్రముఖ దేవాలయాలకు వెళ్లే వారి కోసం ప్రత్యేక బస్సులు నడుపాలని ఆర్‌టిసి నిర్ణయం తీసుకుంది. మంగళవారం హైదరాబాద్‌లోని తన అధికారిక నివాస గృహంలో మహా శివరాత్రి సందర్భంగా ఆర్‌టిసి బస్సు సర్వీసుల ఏర్పాట్లపై అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. మహా శివరాత్రి సందర్భంగా భక్తులు అధికంగా వెళ్ళే వేములవాడ, శ్రీశైలం, ఏడుపాయల, కీసర, పాలకుర్తి దేవాలయాలకు వెళ్ళే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు నడపాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు ఆదేశాలిచ్చారు.గత సంవత్సరం కంటే భక్తులు అధికంగా వచ్చే అవకాశం ఉన్నందున అదనపు బస్సులు నడిపేలా ప్రణాళికలు రూపొందించాలని సూచనలు చేశారు. బస్ స్టాండ్‌ల వద్ద అధిక రద్దీ ఉన్నప్పుడు ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా ఆర్‌టిసి ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్‌టిసి ఎండి సజ్జనార్, ఈడి మునిశేఖర్, సిటిఎం శ్రీధర్, ఫైనాన్స్ అడ్వైజర్ విజయ పుష్ప తదితరులు పాల్గొన్నారు.

## ఇండియాస్ గాట్ టాలెంట్’ షోలో అసభ్యకర వ్యాఖ్యలు

## యూట్యూబర్ రణ్‌వీర్ అల్హాబాదియాపై మండిపడ్డ సుప్రీం కోర్టు



**న్యూఢిల్లీ ఫిబ్రవరి 18 :** ‘ఇండియాస్ గాట్ టాలెంట్’ షోలో అసభ్యకర వ్యాఖ్యలు చేసిన యూట్యూబర్ రణ్‌వీర్ అల్హాబాదియాపై సుప్రీం కోర్టు మండిపడింది. అతనిది చెత్త, వికృతమైన మనస్తత్వం అంటూ అసహనం వ్యక్తం చేసింది. జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం.. వాక్ స్వాతంత్ర్యం పేరుతో ఎలాంటి వ్యాఖ్యలు అయినా చేస్తారా అని ప్రశ్నించింది.పాపులారిటీ కోసం సమాజానికి విఘాతం కలిగే విధంగా మాట్లాడితే.. ఎవరూ ఊరుకోరు అని స్పష్టం చేసింది. అసలు శృంగారంపై మాట్లాడేందుకు నోరు ఎలా వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేసింది. నీ మనస్సులో ఎంత చెత్త ఉందో దాన్ని బయటపెట్టేందుకు ఏదైనా లైసెన్స్ ఉందా అని ప్రశ్నించింది. షోలో రణ్‌వీర్ మాట్లాడిన విధానం ప్రతీ తల్లిదండ్రులు, అక్కచెల్లెలు, పిల్లలు సిగ్గుపడే విధంగా ఉన్నాయని తెలిపింది.అయితే రణ్‌వీర్‌ని తీవ్రంగా మందలించిన అత్యున్నత న్యాయస్థానం ఆ తర్వాత స్వల్ప ఊరట కల్పించింది. ఈ వ్యవహారంలో మరో పోలీసు కేసు నమోదు చేయవద్దని.. కోర్టు అనుమతి లేకుండా దేశం వదలి వెళ్లకూడదని తెలిపింది. రణ్‌వీర్ పాస్‌పోర్టుని మహారాష్ట్రలోని థాణె పోలీసులకు అప్పగించాలని ఆదేశించింది. కొంతకాలంపాటు షోలకు దూరంగా ఉండాలని పేర్కొంది.

## ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) రాజీవ్ కుమార్ పదవీ విరమణ



**న్యూఢిల్లీ ఫిబ్రవరి 18 :** 2024 లోక్‌సభ ఎన్నికలను, కీలకమైన జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలను పర్యవేక్షించిన ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) రాజీవ్ కుమార్ మంగళవారం పదవీ విరమణ చేశారు. 25వ సిఇసిగా సుమారు మూడు సంవత్సరాలు సాగిన రాజీవ్ కుమార్ హయాం ఎక్కువ ఎన్నికల విజయాలను నమోదు చేసింది. అయితే, ఆయన పక్షపాతంతో వ్యవహరించారని ప్రతిపక్షాలు పదే పదే ఆరోపణలు చేశాయి. ఎన్నికల కమిషనర్‌గా 2020 సెప్టెంబర్ 1న ఇసిలో చేరిన రాజీవ్ కుమార్ 2022 మే 15న 25వ సిఇసిగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన రెండు హోదాల్లో దాదాపు నాలుగున్నర సంవత్సరాల పాటు ఇసిలో సేవలు అందించారు.ఇసిగా తన హయాంలో ఆయన వ్యవస్థాత్మక, సాంకేతిక, సామర్థ్యం అభివృద్ధి, కమ్యూనికేషన్. అంతర్జాతీయ సహకారం, పరిపాలన యంత్రాంగం వంటి వివిధ అంశాల్లో సంస్కరణలు తీసుకువచ్చారు. రాజీవ్ కుమార్ 31 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎన్నికలు, 2022లో రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికలు, 2024లో లోక్‌సభ ఎన్నికలు, రాజ్యసభ ఎన్నికల నిర్వహణను పర్యవేక్షించడం ద్వారా ఒక ‘సంపూర్ణ ఎన్నికల వలయాన్ని’ పూర్తి చేశారు. అయితే, ఇవిఎంల సామర్థ్యం వోటర్ల డేటా తారుమారు, అధికార బిజెపి పట్ల ‘ఔదాశీన్యం’ ప్రదర్శించడం సహా పలు అంశాలపై ప్రతిపక్షాలు, హక్కుల కార్యకర్తల నుంచి ఆయన తరచు విమర్శలు ఎదుర్కొన్నారు. కమిషన్ ఆరోపణలకు లిఖితపూర్వకంగా స్పందించి, తిరస్కరించగా, రాజీవ్ కుమార్ తనను, ఇసిని సమర్థించుకోవడానికి తరచు కవితలను ఎంచుకున్నారు.‘రిటైర్‌మెంట్ అనంతరం పదవి చేపట్టడానికి అధికార బిజెపి పట్ల ఉదాశీనంగా వ్యవహరిస్తున్నారని’ విమర్శలు వచ్చినప్పుడు రాజీవ్ కుమార్ తాను పదవీ విరమణ చేసిన తరువాత ‘ఆత్మావలోకనానికి ఆరు నెలల పాటు ‘హిమాలయాలకు’ వెళతానని ప్రకటించారు. మంగళవారం పదవిలో తన చివరి రోజు రాజీవ్ కుమార్ ‘పిటిఐ వీడియోస్’తో మాట్లాడుతూ, తాను అత్యంత సమర్థుల చేతుల్లో ఇసిని వదులుతున్నానని, భారతీయ వోటర్లు తమ శక్తి మేర కమిషన్‌కు అండగా నిలుస్తారని చెప్పారు. రాజీవ్ కుమార్ స్థానంలో జ్ఞానేశ్ కుమార్ సిఇసిగా బాధ్యతలు స్వీకరిస్తారని ప్రభుత్వం సోమవారం రాత్రి ప్రకటించిన విషయం విదితమే. 1984 బ్యాచ్ బీహార్/ జార్ఖండ్ కేడర్ ఐఎఎస్ అధికారి అయిన రాజీవ్ కుమార్ 2020 ఫిబ్రవరిలో ప్రభుత్వ సర్వీస్ నుంచి రిటైరయ్యారు.

## నేరాల శైలీ మారుతోంది..

## మనమూ మారాలి : సిఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ ఫిబ్రవరి 18 :** సైబర్ నేరాలను అరికట్టేందుకు తెలంగాణలో ప్రత్యేకంగా సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సైబర్ నేరాల పరిష్కారం కోసం హెచ్‌ఐసిసిలో ఏర్పాటు చేసిన ‘షీల్డ్ 2025’లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. “సైబర్ నేరాల్లో కోల్పోయిన సొమ్మును తిరిగి తీసుకురావడంలో సైబరాబాద్ పోలీసులు ముందంజలో ఉన్నారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు గత ఏడాది 7 కొత్త పోలీసు స్టేషన్లను ఏర్పాటు చేశాం. ఒకప్పుడు ఇంట్లో ఉండే సొమ్మును దొంగలు దోచుకొనేవారు.. కానీ ఇప్పుడు ఏక్కడి నుంచి దోపిడి చేస్తున్నారో తెలుసుకోవడం కష్టంగా మారిపోయింది. నేరాల శైలీ మారుతోంది, దానికి అనుగుణంగా ప్రజలు, ప్రభుత్వం మారాలి’ అని అన్నారు.ఈ సమావేశంలో 14 రాష్ట్రాల నుంచి పోలీసు అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశం ఇంత విజయవంతం కావడం చాలా సంతోషంగా ఉందని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ అన్నారు. 2024లో సైబర్ నేరాల్లో కాజేసిన రూ.350 కోట్లను సీజ్ చేశామని.. అందులో రూ.183 కోట్లు 18 వేల మంది బాధితులకు అందించామని పేర్కొన్నారు.

మన వెలుగు
MANA VELUGU TELUGU DAILY



# కొత్త సిఇసిగా జ్ఞానేశ్ కుమార్..సోమవారం రాత్రి నియమించిన ప్రభుత్వం

## - ఇది ప్రధానికి, హోమ్ మంత్రికి 'అవమానకరం: రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ ఫిబ్రవరి 18 :** ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) ఎంపిక ప్రక్రియను సుప్రీం కోర్టులో సవాల్ చేసినప్పుడు కొత్త సిఇసి ఎంపికపై అర్ధరాత్రి నిర్ణయం తీసుకోవడం ప్రధానికి, హోమ్ శాఖ మంత్రికి 'అవమానకరం, అమర్యాదకరం' అని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ మంగళవారం ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోడీ సారథ్యంలోని ఎంపిక కమిటీ సమావేశమైన కొన్ని గంటల తరువాత సోమవారం రాత్రి మాజీ ఐఎఎస్ అధికారి జ్ఞానేశ్ కుమార్‌ను కొత్త సిఇసిగా ప్రభుత్వం నియమించింది. హర్యానా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వివేక్ జోషిని ఎన్నికల కమిషనర్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ విషయమై సుప్రీం కోర్టు విచారణ జరుపుతున్న దృష్ట్యా సమావేశాన్ని వాయిదా వేయవలసిందిగా ప్రభుత్వాన్ని లోక్‌సభలోని ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కోరారు. రాహుల్ గాంధీ కమిటీకి ఒక అసమ్మతి పత్రాన్ని అందజేశారు.కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా కూడా కమిటీలో ఒక సభ్యుడు. 'తదుపరి ఎన్నికల కమిషనర్ ఎంపిక నిమిత్తం కమిటీ సమావేశంలో నేను ప్రధానికి, హోమ్ శాఖ మంత్రికి ఒక అసమ్మతి పత్రం అందజేశాను. కార్యనిర్వాహక వర్గ జోక్యం లేని స్వతంత్ర ఎన్నికల కమిషన్‌కు సంబంధించి అత్యంత మౌలిక అంశం ఏమిటంటే ఎన్నికల కమిషనర్, ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎంపిక ప్రక్రియ' అని ఆ పత్రంలో రాశాను' అని రాహుల్ గాంధీ 'ఎక్స్' పోస్ట్‌లో తెలియజేశారు.'సుప్రీం కోర్టు ఉత్తర్వును ఉల్లంఘించడం, కమిటీలో నుంచి భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ)ని తొలగించడం ద్వారా మోడీ ప్రభుత్వం మన ఎన్నికల ప్రక్రియ సమగ్రతపై కోట్లాది మంది వోటర్ల ఆందోళనలను తీవ్రతరం చేసింది' అని రాహుల్ గాంధీ తన పోస్ట్‌లో అసమ్మతి పత్రాన్ని పంచుకుంటూ వ్యాఖ్యానించారు.ప్రతిపక్ష నాయకునిగా తన కర్తవ్యం బాబా సాహెబ్ అంబేద్కర్, దేశ వ్యవస్థాపక నేతల ఆశయాలను పరిరక్షించడం, ప్రభుత్వాన్ని జవాబుదారీ చేయడం అని ఆయన పేర్కొన్నారు. 'అసలు కమిటీ కూర్పు, ఎంపిక ప్రక్రియను సుప్రీం కోర్టులో సవాల్ చేస్తున్నప్పుడు, 48 గంటలలోపే విచారణ జరగనున్నందున కొత్త సిఇసి ఎంపికపై అర్ధరాత్రి నిర్ణయం తీసుకోవడం ప్రధానికి, హోమ్ శాఖ మంత్రికి అవమానకరం, అమర్యాదకరం' అని కూడా రాహుల్ వ్యాఖ్యానించారు. ఈ నియామకాలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఆక్షేపించింది. సుప్రీం కోర్టు పరిశీలనను 'తప్పించాలని', కోర్టు తీర్పు వెలువడే లోపే నియామకం జరపాలని ప్రభుత్వం పట్టుదలతో ఉందని కాంగ్రెస్ ఆరోపించింది.

# అదానీ వాకౌట్‌కు విచారించడం లేదు



శ్రీలంకలో హరిత ఇంధన శక్తి ప్రాజెక్టుల నుంచి అదానీ గ్రూప్ తప్పుకోవడంపై తమ ప్రభుత్వం ఏమీ విచారించడం లేదని శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిస్సనాయకె సోమవారం తెలిపారు. శ్రీలంక ఆర్థిక శాఖ మంత్రి కూడా అయిన దిస్సనాయకె తన 2025 బడ్జెట్ ప్రతిపాదన సమయంలో అదానీ గ్రీన్ ఎనర్జీ పేరు ప్రస్తావించకుండానే '4.65 యుఎస్ సెంట్లకు వాయు విద్యుత్ సరఫరాకు మాకు ఆఫర్ వచ్చినందున 8.26 సెంట్లకు ఆఫర్ వదులుకోవడంపై విచారించవలసిన అవసరం లేదు' అని అన్నారు. శ్రీలంక ఈశాన్య ప్రాంతంలో తమ హరిత విద్యుత్ ప్రాజెక్టు కోసం 400 యుఎస్ మిలియన్ డాలర్ల పెట్టుబడిపై నిష్క్రమిస్తున్నామని అదానీ క్రితం వారం ప్రకటించారు. 'ఒక మదురి దేశం వీడారంటూ వగస్తున్నవారు ఉన్నారు' అని దిస్సనాయకె వ్యాఖ్యానించారు. ఎన్‌పిపి ప్రభుత్వ విధానాలు పెట్టుబడిదారులను భయపెడుతున్నాయన్న ప్రతిపక్షాల విమర్శను ప్రస్తావిస్తూ ఆయన ఆ వ్యాఖ్య చేశారు. అదానీ వాయు విద్యుత్ ప్రాజెక్టును సమీక్షించాలని, విద్యుత్ కొనుగోలు ఒప్పందంపై తిరిగి సంప్రదింపులు జరపాలని దిస్సనాయకె ప్రభుత్వం డిసెంబర్ చివర్లో నిర్ణయించిన తరువాత అదానీ గ్రూప్ ఆ ప్రాజెక్టు నుంచి నిష్క్రమించింది.

# యుఎస్‌లో దుర్భర శీతల వాతావరణం



యుఎస్‌లో తాజాగా అతి శీతల వాతావరణంతో పరిస్థితులు దుర్భరంగా మారగా కనీసం తొమ్మిది మంది మరణించారు. వారిలో ఎనిమిది మంది ఒక్క కెంటుక్కీలోనే మృతి చెందారు. భారీ వర్షానికి నీటి కయ్యలు పొంగిపోగా రోడ్లపై వరద వెల్లువెత్తింది. వరద నీటిలో చిక్కుకుపోయిన వందలాది మందిని రక్షించవలసి వచ్చిందని కెంటుక్కీ గవర్నర్ ఆండీ బెషియర్ వెల్లడించారు. వరద ప్రవాహంలో కార్లు చిక్కుకుపోవడం వల్ల చాలా మంది మృతి చెందారని, వారిలో ఒక తల్లి,ఏడు సంవత్సరాల పిల్లవాడు కూడా ఉన్నారని బెషియర్ తెలిపారు. భారీ వర్షాలకు దాదాపు 39 వేల్ల ఇళ్లకు విద్యుత్ అంతరాయం వాటిల్లిందని ఆయన చెప్పారు. అయితే, కొన్ని ప్రాంతాల్లో పెను గాలులకు విద్యుత్ సరఫరాకు అంతరాయం వాటిల్లవచ్చునని ఆయన హెచ్చరించారు. కెంటుక్కీతో పాటు అమెరికాలో చాలా భాగం దుర్భరమైన శీతల వాతావరణం నెలకొంది. ఉత్తర మైదాన ప్రాంతాల్లో చలి బాగా వణికిస్తోంది. జార్జియా, ఫ్లోరిడాలోని కొన్ని ప్రాంతాల్లో సుడిగాలి ముప్పు ఉందని హెచ్చరించారు. బోన్విల్లె ప్రాంతంలో శనివారం రాత్రి తల్లి, పిల్లవాడు వరద ప్రవాహంలో కొట్టుకుపోయారని హార్ట్ కౌంటీ కరోనర్ టోనీ రాబర్ట్ తెలిపారు. క్లే కౌంటీలో 73 ఏళ్ల వృద్ధుడు వరదనీటిలో విగతజీవిగా కనిపించినట్లు కౌంటీ అత్యవసర విపత్తు స్పందన విభాగం డిప్యూటీ డైరెక్టర్ రెవెల్ బెర్రీ చెప్పారు. కెంటుక్కీ, టెన్నిస్సీలోని కొన్ని ప్రాంతాల్లో వారాంతపు తుపానుల్లో 15 సెంమీ వర్షపాతం నమోదైందని జాతీయ వాతావరణ సంస్థ సీనియర్ అధికారి బాబ్ ఓరవెక్ తెలిపారు. అట్లాంటాలో ఒక భారీ వృక్షం ఇంటిపై పడగా ఒక వ్యక్తి మరణించినట్లు అట్లాంటా అగ్నిమాపక దళ అధికారి విలేకరులతో చెప్పారు.

# బంగ్లాదేశ్ నా మాతృభూమి..మాతృభూమి తిరిగి వస్తా..

## కార్యకర్తల మరణానికి ప్రతీకారం తీర్చుకుంటా.. షేక్ హసీనా



**ఢాకా ఫిబ్రవరి 18 :** 'నా మాతృభూమికి తిరిగి వస్తాను డ కార్యకర్తల మరణానికి ప్రతీకారం తీర్చుకుంటాను' అని బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా ప్రతిజ్ఞ చేశారు. దేవుడు తనను ప్రాణాలతో ఉంచింది అందుకేనని ఆమె తెలిపారు. బంగ్లాదేశ్ ప్రజలను ప్రస్తుతం ఉగ్రవాద ప్రభుత్వం పాలిస్తోందని, మహ్మద్ యూనస్ ఒక ఉగ్రవాది అని హసీనా సంచలన వ్యాఖ్యలు చేశారు. బంగ్లాదేశ్‌లో అవామీ లీగ్ పార్టీ కార్యకర్తల ఏర్పాటు చేసిన ఒక బహిరంగ కార్యక్రమంలో హసీనా జూమ్ కాల్ ద్వారా హాజరయ్యారు. హసీనా ఈ సందర్భంగా తన పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ, తాను త్వరలోనే తిరిగి వస్తానని చెప్పారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు అంత వరకు ఓపిక పట్టాలని ఆమె కోరారు.నిరుడు జూలై, ఆగస్టు నెలల్లో విద్యార్థులు చేసిన ఆందోళనల్లో పలువురు పోలీసులు, అవామీ లీగ్ కార్యకర్తలు, విద్యావంతులు, కళాకారులు హత్యకు గురయ్యారని హసీనా గుర్తు చేశారు.అయినప్పటికీ ఆ హత్యలకు కారకులపై యూనస్ చర్య తీసుకోలేదని ఆమె ఆరోపించారు. విచారణ కమిటీలను రద్దు చేసి యూనస్ ప్రభుత్వం దేశాన్ని నాశనం చేస్తోందని ఆమె మండిపడ్డారు. ప్రభుత్వ కార్యాలయాలపైన, అధికారులపైన దాడులు చేయడం యూనస్ అసమర్థతకు నిదర్శనమని హసీనా విమర్శించారు. మధ్యంతర ప్రభుత్వం ఏర్పడి నెలలు గడుస్తున్నా అల్లర్లు ఆగలేదని ఆమె విమర్శించారు. దేశంలో శాంతి భద్రతలు నానాటికీ క్షీణిస్తున్నాయని, ఆర్థిక వ్యవస్థ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నదని ఆమె ఆరోపించారు. ఈ ఉగ్రవాద ప్రభుత్వాన్ని తరిమి కొట్టాలని హసీనా ప్రజలకు పిలుపు ఇచ్చారు. ఆందోళనల్లో మరణించిన పలువురు పోలీసుల కుటుంబాలతో హసీనా ఈ సందర్భంగా మాట్లాడారు.

# అడవి జంతువులు, కోతుల నుండి పంటల రక్షణకు సోలార్ ఫెన్సింగ్ స్కీం

### - పామాయిల్ తో పాటు ఇతర పంటలకు డ్రిప్, తుంపర సేద్య పరికరాలు

### - రాష్ట్ర అవసరాలు తీర్చే విధంగా కూరగాయల సాగు

### - జూన్ మొదటి వారంలోపు అందుబాటులోకి మరో ఆయిల్ పామ్ కర్మాగారం

### - సమీక్షా సమావేశంలో మంత్రి తుమ్మల వెల్లడి

రాష్ట్రంలో కోతులు, ఇతర అడవి జంతువుల వల్ల ఇబ్బంది ఉన్న అన్ని జిల్లాలలో ఉద్యాన పంటల రక్షణకు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు వీలుగా సోలార్ ఫెన్సింగ్ స్కీంను అమలు చేస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఇందుకోసం ఆ పథకం అమలవుతున్న హిమాచల్ ప్రదేశ్ లాంటి రాష్ట్రాలలో పర్యటించి, రాష్ట్ర ప్రభుత్వం తరపున సబ్సిడీపై అందజేసేందుకు విధివిధానాలు వెంటనే సిద్ధం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. దీనివల్ల కూరగాయలు మరియు ఉద్యాన పంటల సాగు చేయడానికి రైతులు ముందుకు రావడానికి అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. మంగళవారం హైదరాబాద్ లోని సచివాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ...హైదరాబాద్ నగరానికి 100 కిలోమీటర్ల పరిధిలోపు ఉన్న అన్ని ప్రాంతాలలో కూరగాయాల సాగు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అందుకోసం పెరి అర్బన్ క్లస్టర్లను ఏర్పాటుచేసి, రైతులకు ప్రోత్సహకాలు కూడా అందించేలా చూడాలన్నారు. కూరగాయల సాగు కోసం అవసరం మేరకు యంత్ర పరికరాలు సబ్సిడిపై అందించి, సాగును పెద్ద ఎత్తున ప్రోత్సహించాలన్నారు. రాబోయే రెండు, మూడు సంవత్సరాలలో కూరగాయల పంటలను పెద్ద ఎత్తున ఉత్పత్తిచేసి, కూరగాయలను దిగుమతి చేసుకొనే స్థితి నుండి ఎగుమతి చేసే స్థితికి తీసుకురావాలని మంత్రి తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరం సంబంధించి కూడా ముందస్తుగా డ్రిప్ మరియు స్ప్రింక్లర్ల పంపిణీ కోసం ధరఖాస్తులను స్వీకరించి, గ్రౌండింగ్ మొదలు పెట్టాల్సిందిగా ఆదేశించారు. ఇతర రాష్ట్రాలలో సాగు చేస్తు లాభాలు పొందుతున్న మెకడమియా పంటను రాష్ట్రంలో ప్రవేశపెట్టడానికి గల వాతావరణ స్థితిగతులు, నేలలు, నర్సరీలు, మార్కెటింగ్ అవకాశాలను అధ్యయనం చేయాలని ఉద్యానశాఖ అధికారులను మంత్రి తుమ్మల ఆదేశించారు. మార్చి నెలాఖరు కల్లా ఆయిల్ పామ్ సాగు లక్ష్యాన్ని చేరుకునేలా చర్యలు తీసుకోవాలని, తక్కువ పురోగతి ఉన్న కంపెనీలకు నోటిసులు జారీ చేసి, ఏఏ జిల్లాలలో తక్కువ పురోగతి ఉందో వాటికి అనుమతులు రద్దు చేసేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి ఈ సందర్భంగా సూచించారు. ఆయిల్ పామ్ చట్టంలో ఉన్న నిబంధనలను అనుసరించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇప్పటికే విశ్వతేజ ఆయిల్ పామ్ కంపెనీకి ఇచ్చిన అనుమతులు రద్దు చేసి మల్టి నేషనల్ కంపెనీ అయిన హిందుస్థాన్ యూనిలివర్ లిమిటెడ్ కంపెనీకి సదరు ప్రాంతాన్ని అప్పగించడం జరిగిందని, అలాగే ఇంకా ఎక్కడైతే కంపెనీలు మూడు, నాలుగు సంవత్సరాలు అయినప్పటికి ప్రాసెసింగ్ ప్లాంట్ నిర్మాణానికి భూమి గుర్తించక పోవడం, ప్లాంటేషన్ లక్ష్యాన్ని చేరుకోని కంపెనీలను తొలగించి, వాటి స్థానంలో ఆయిల్ ఫెడ్ కు బాధ్యతలు అప్పగించడం జరుగుతుందని తెలియజేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఆయిల్ పామ్ సాగు కోసం రెండు లక్షల ఎకరాలను లక్ష్యంగా పెట్టుకొని పనిచేయాలని ఆదేశించారు. ఆయిల్ ఫెడ్ సిబ్బందికి కూడా లక్ష్యాలు నిర్దేశించి వాటిని చేరుకొనే విధంగా పనిచేసేటట్లు చూడాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రైవేట్ కంపెనీలు కూడా లక్ష్యానికి అనుగుణంగా ప్లాంటేషన్ పూర్తి చేసేట్టుగా, ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి పర్యవేక్షణ చేయాలని ఉద్యానశాఖ డైరెక్టర్ సూచించారు. వచ్చే సంవత్సరం చివరికల్లా ఉమ్మడి జిల్లాలలో కనీసం ఒక పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం జరిగేలా చూడాలని, పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి కనీసం సంబంధింత జిల్లాలలో 6 వేల ఎకరాలకు పైన ప్లాంటేషన్ ఉండేట్టుగా చర్యలు తీసుకోవాలని తుమ్మల ఆదేశించారు. టిఎస్ ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా నర్మెట్ట గ్రామంలో నిర్మాణం జరుగుతున్న ఆయిల్ పామ్ కర్మాగారాన్ని మే నెలాఖరుకల్లా పూర్తి చేయాలని, అదేవిధంగా గద్వాల జిల్లా బీచుపల్లిలో, ఖమ్మం జిల్లా కల్లూరిగూడంలో ఆయిల్ పామ్ కర్మాగారాల ఏర్పాటుకు టెండర్ల ప్రక్రియను వెంటనే పూర్తిచేసి, పనులు ప్రారంభించి, ఈ డిసెంబర్ కల్లా వాటి నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా 6 వేల ఎకరాలపైన ప్లాంటేషన్ పూర్తి చేసిన ప్రైవేట్ కంపెనీలు కూడా వెంటనే పామ్ ఆయిల్ కర్మాగారాలను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్షా సమావేశంలో వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్ రావు, హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా, ఆయిల్ ఫెడ్ అధికారులు, ఉద్యానశాఖ అధికారులు పాల్గొన్నారు.




# సమర వీరుడు చత్రపతి శివాజీ మహారాజ్ జీవిత చరిత్ర



ఛత్రపతి శివాజీగా ఖ్యాతి పొందిన శివాజీ రాజే భోంస్లే (ఫిబ్రవరి 19, 1627%శి1ర% - ఏప్రిల్ 3, 1680) పశ్చిమ భారతదేశాన మరాఠా సామ్రాజ్యాన్ని నెలకొల్పి మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించాడు.తెలుగు సంవత్సరం,1674 సంవత్సరం, హిందూ నెల జ్యేష్ఠ శుద్ధ త్రయోదశి నాడు ఛత్రపతి శివాజీ పట్టాభిషేక వార్షికోత్సవం జరిగిన సందర్భంగా హిందూ సామ్రాజ్య దివాస్ జరుపుకుంటారు.%శి2ర%శివాజీ సా.శ. 1630 ఫిబ్రవరి 19వ సంవత్సరం వైశాఖమాసపు శుక్లపక్ష తదియనాడు పూణే జిల్లాలోని జున్నార్ పట్టణం దగ్గర శివనేరి కోటలో షాహాజీ, జిజియాబాయి దంపతులకు జన్మించాడు.%శి3రశి4రశి5ర% వీరు మహారాష్ట్రలోని వ్యవసాయం చేసుకునే భోస్లే కులానికి చందినవారు. శివాజీ తల్లి జిజియాబాయి యాదవ క్షత్రియ వంశమునకు చెందిన ఆడ పడుచు. (దేవగిరి మరాఠా యాదవ రాజుల వంశము). శివాజీకి ముందు పుట్టిన అందరూ మృతి చెందగా ఆమె పూజించే దేవత అయిన శివై పార్వతి పేరు శివాజీకు పెట్టింది.షాహాజీ నిజాంలను ఓడించి గెలుచుకున్న ప్రాంతాల్లో సామ్రాజ్యాన్ని నెలకొల్పడానికి ప్రయత్నిస్తుండగా, మొఘలులు ఆదిల్షాతో కలసి షాహాజీని ఓడించారు. ఆదిల్షాతో సంధి ప్రకారం షాహాజి ప్రస్తుత బెంగుళూరు ప్రాంతాన్ని జాగీరుగా పొంది, పూణే వదిలి వెల్లవలసి వచ్చింది. షాహాజీ పూణేలో తనకున్న జాగీరును వదులుకోవలసిన అవసరం లేకుండా ఒప్పందం కుదుర్చుకొన్నాడు.

**సామ్రాజ్య అంకురార్పణ:-**షాహాజీ పూణేలో తన జాగీరు వ్యవహారాలను తన భార్యకు అప్పగించి యువకుడయిన శివాజీకి రాజనీతి వ్యవహారాలు నేర్పడానికి కొందరు ముఖ్య అనుచరులతో కలసి ఒక విభాగాన్ని ఏర్పాటు చేసి తాను బెంగుళూరు జాగీరుకు వెళ్ళాడు.శివాజీ తల్లి అతనికి పుట్టిన భూమి పైన, ప్రజల పైన ప్రేమ కలుగునట్లు విద్యాబుద్ధులు నేర్పింది. చిన్నప్పటినుండి భారత రామాయణ బలి చక్రవర్తి గాథలు చెప్పి వీర లక్షణాలు మొలకింప చేసింది. పరమత సహనం, స్త్రీల పట్ల గౌరవం తన తల్లివద్దనే నేర్చుకున్నాడు. తన తండ్రి పొందిన పరాజయాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి అనతి కాలంలో శివాజీ యుద్ధ తంత్రాలలో నిష్ణాతుడయ్యాడు. సకల విద్యలు తెలుసుకొన్న శివాజీ మరాఠా సామ్రాజ్య స్థాపనే లక్ష్యంగా తన వ్యూహాలు మొదలు పెట్టాడు.సుల్తానులతో యుద్ధాలు:-17 ఏళ్ళ వయసులో శివాజీ మొట్టమొదటి యుద్ధం చేసి బిజాపూర్ సామ్రాజ్యానికి చెందిన తోర్నా కోటను సొంతం చేసుకున్నాడు. మరో మూడేళ్ళలో కొండన, రాజ్‌ఘడ్ కోటలను సొంతం చేసుకొని పూణే ప్రాంతాన్నంతా తన స్వాధీనంలోకి తెచ్చుకున్నాడు.శివాజీ తమ కోటలను సొంత చేసుకోవడం చూసి ఆదిల్షా మోసపూరితంగా శివాజీ తండ్రి అయిన షాహాజీని బందీ చేసాడు. తర్వాత శివాజీని, బెంగుళూరులో ఉన్న శివాజీ అన్న అయిన శంభాజీని పట్టుకోవడానికి రెండు సైన్యాలను పంపగా అన్నదమ్ములిరువురు ఆ సైన్యాలను ఓడించి తమ తండ్రిని బంధ విముక్తుడిని చేయించుకున్నారు. అప్పుడు ఆదిల్షా యుద్ధ భయంకరుడుగా పేరు పొందిన అఫ్జల్ ఖాన్‌ను శివాజీ పైకి యుద్ధానికి పంపపిం

**ప్రతాప్‌ఘడ్ యుద్ధంచాడు:-** శివాజీ మెరుపుదాడులు, గెరిల్లా యుద్ధ పద్ధతులు తెలుసుకొన్న అఫ్జల్ ఖాన్ అతడిని ఓడించడానికి యుద్ధభూమి మాత్రమే ఏకైక మార్గమని తలచి శివాజీని రెచ్చకొట్టడానికి శివాజీ ఇష్ట దైవమయిన భవానీ దేవి దేవాలయాలను కూల్చాడు. ఇది తెలిసిన శివాజీ తాను యుద్ధానికి సిద్ధముగా లేనని చర్చలకు ఆహ్వానించాడు. ప్రతాప్‌ఘడ్ కోట దగ్గర సమావేశమవడానికి ఇద్దరూ అంగీకరించారు.అఫ్జల్ ఖాన్ సంగతి తెలిసిన శివాజీ ఉక్కు కవచాన్ని ధరించి పిడిబాకు లోపల దాచుకున్నాడు. ఇద్దరూ కేవలం తమ అంగరక్షకులతో గుడారంలోకి వెళ్ళి చర్చలు జరుపుతుండగా అఫ్జల్ ఖాన్ దాచుకున్న కత్తితో శివాజీ పైన దాడి చేసినపుడు ఉక్కు కవచం వల్ల శివాజీ తప్పించుకున్నాడు. అంతలో అడ్డు వచ్చిన అఫ్జల్ ఖాన్ సైనికాధికారులను, శివాజీ సైన్యాధికారులు అడ్డుకోనగా, శివాజీ తన దగ్గరన్న పిడి పులి గోర్లతో అఫ్జల్ ఖాన్ పొట్టను ఉగ్ర లక్ష్మీనరసింహ వలె చీల్చి చెందాడుతాడు. అఫ్జల్ ఖాన్ తప్పించుకొని గుడారం నుండి బయటకు పారిపోతుండగా, ఒకే వేటుకు శివాజీ అఫ్జల్ ఖాన్ తల నరుకుతాడు.అఫ్జల్ ఖాన్ సేనను శివాజీ సేన దట్టమయిన అడవుల్లో అటకాయించి మెరుపుదాడులతో మట్టికరపించింది. ఈ విజయంతో శివాజీ మరాఠా యోధుడిగా మహారాష్ట్ర అంతా పేరు తెచ్చుకున్నాడు. ఎలాగయినా శివాజీని అణచాలని బీజాపూర్ సుల్తాన్ యుద్ధవీరులుగా పేరు తెచ్చుకున్న ఆఫ్ఘన్ పస్థూన్ సైనికులను పంపించగా, శివాజీ సేన వేల సంఖ్యలో పస్థూన్లను చంపి విజయం సాధించింది. ఈ సంఘటనతో శివాజీ కీర్తి ప్రతిష్ఠలు భారతదేశమంతా వ్యాపించాయి. ఎందరో హిందూ రాజులకు శివాజీ ఆదర్శంగా నిలిచాడు.



**కొల్హాపూర్ యుద్ధం:-** ఇది సహించలేని బిజాపూర్ సుల్తాన్ అరబ్, పర్షియా, ఆఫ్ఘన్ నుండి మెరికల్లాంటి 10,000 మంది కిరాయి సైనికులను శివాజీని అంతమొందించడానికి పంపగా శివాజీ తన వద్దనున్న 5,000 మరాఠా యోధులతో కలసి కొల్హాపూర్ వద్ద ఎదుర్కొన్నాడు. 'హర హర మహాదేవ ' అంటూ శివాజీ యుద్ధరంగంలో విజృంభించి శతృవులను ఊచకోత కోశాడు. ఈ విజయంతో కేవలం సుల్తానులే కాక మొఘల్ చక్రవర్తి అయిన ఔరంగజేబుకు సైతం శివాజీ అంటే భయం పుట్టింది. శివాజీ నుండి ఎప్పటికయినా తనకు ముప్పు తప్పదని ఔరంగజేబు భావించి సన్నాహాలు మొదలు పెట్టాడు.తన మేన మామ షాయిస్త ఖాన్ ను శివాజీ పై యుద్ధానికి పంపాడు.పవన్‌ఖిండ్ యుద్ధంరెండుసార్లు పరాజయాన్ని ఎదుర్కొన్న అదిల్షా మూడవసారి సిద్ది జోహార్ అనే పేరు పొందిన సైన్యాధ్యక్షుడికి అపారమయిన సైనిక, ఆయుధ బలగాలు అందించి కొల్హాపూర్ పంపించాడు. ఆ సమయంలో కొల్హాపూర్ దగ్గరలో ఉన్న పన్‌హాలా కోటలో శివాజీ కొన్ని వందలమంది అనుచరులతో ఉన్నాడు. సిద్ది జోహార్ విషయం తెలుసుకొన్న శివాజీ ఎలాగయినా పన్‌హాలా కోట నుండి తప్పించుకొని తన సైన్యం మొత్తం ఉన్న విశాల్‌ఘడ్ కోటకు చేరుకొంటే యుద్ధం చేయవచ్చు అనుకున్నాడు. కానీ అప్పటికే పన్‌హాలా కోట చుట్టూ శత్రుసైన్యం ఉండడంతో తాను యుద్ధానికి సిద్ధంగా లేనని దయతలచవలసినదిగా సిద్ది జోహార్‌కు వర్తమానం పంపాడు. అది తెలుసుకొన్ని సిద్ది జోహార్ సైనికులు నిషా సరళం చేసి విశ్రాంతి తీసుకొంటుంటే, శివాజీ తన అనుచరులతో కోట నుండి తప్పించుకొని తన సైన్యం ఉన్న కోటవైపు పయనించసాగాడు. చివరిక్షణంలో ఇది తెలుసుకొన్న సిద్ది జోహార్ తన బలగాలతో శివాజీని వెంబడించసాగాడు.

కోటకు చేరుకొనేలోపు శత్రువులు తమను సమీపించగలరు అన్ని విషయం గ్రహించి బాజీ ప్రభు దేశ్‌పాండే అనే సర్దార్ 300 మంది అనుచరులతో కలసి తాము శత్రుసైన్యాన్ని ఎదుర్కొంటామని, శివాజీని తన అంగరక్షకులతో ఎలాగయినా కోట చేరుకోమని చెప్పి ఒప్పించాడు. శివాజీ కోట వైపు వెళ్ళిన వెంటనే బాజీ ప్రభు దేశ్‌పాండే రెండు చేతులా ఖడ్గాలు పట్టుకొని శత్రువులతో యుద్ధం చేశాడు.300 మంది సైనికులు తమ ప్రాణాలకు తెగించి అతి బలమయిన శత్రువులతో పోరాడి నేలకొరిగారు. అప్పటికి శివాజీ తన కోట చేరుకున్నాడు. కోటలో తన అనుచరులతో చర్చించిన అనంతరం తాము సిద్ది జోహార్ సైన్యాన్ని ఎదుర్కొనలేమని గ్రహించిన శివాజీ సంధికి అంగీకరించాడు. సంధిలో భాగంగా శివాజీ సామ్రాజ్యం స్వతంత్ర రాజ్యంగా గుర్తింపు పొందింది. సిద్ది జోహార్ విజయానికి బహుమతిగా పన్‌హాలా కోట లభించింది.ఈ యుద్ధమే సుల్తానులతో శివాజీ చేసిన ఆఖరి యుద్ధం. ఆ తరువాతి కాలంలో మొఘల్ సైన్యంతో యుద్ధాలు చేయవలసి వచ్చింది.అలుపెరగని యుద్ధాలతో అలసిపోవడం, సరి అయిన సైన్యం లేకపోవడం, ఖజానా ఖాళీ కావడంతో మొఘల్ సైన్యం శివాజీని ఎదుర్కొనలేకపోయింది.

**సింహాగఢ్ యుద్ధం...**శివాజీ ఎన్నో కోటలను సులువుగా స్వాధీనం చేసుకున్నా, పూణే దగ్గర ఉన్న కొండన కోట స్వాధీనం కాలేదు. ఆకోటను ఉదయ్‌భాన్ రాథోడ్ అనే రాజపుత్రుడు పరిరక్షిస్తుండడమే కారణం. దుర్భేధ్యమయిన ఆ కోట చుట్టూ ఎప్పుడూ సైనికులు పహారా కాస్తుండడంతో శివాజీ తనదగ్గర అత్యంత గొప్ప సైనికాధికారిగా పేరు తెచ్చుకొన్ని తానాజీ మలుసారేకి ఆ కోట స్వాధీనం చెసుకొని బాధ్యత అప్పగించాడు.తానాజీ తన అనుచరులతో రహస్యంగా ఆ కోటను కొద్దిరోజులపాటు క్షుణ్ణంగా అధ్యయనం చేసాడు. అన్ని ప్రధాన ద్వారాల్లోకట్టుదిట్టమయిన సైన్యం ఉంది. చివరగా కోటకు ఒకవైపు ఉన్న ఒక కొండ తానాజీని ఆకర్షించింది. ఆ కొండ చాలా ఏటవాలుగా ఉండడంతో సైన్యం ఆ కొండ ఎక్కడం అసాధ్యం. అప్పుడు తానాజీ 'యశ్వంతి ' అనే పేరుకల ఉడుముకు తాడు కట్టి కొండ పైకి విసిరాడు. తాడు సహాయంతో పైకి వెళ్ళినవారు అందించిన తాళ్ళను పట్టుకొని సైన్యం కోటలోకి చేరుకొంది. చరిత్రలో యుద్ధంలో ఉడుమును ఉపయోగించడం ఇదే ప్రథమం అనుకోవచ్చు.

అంతలో తానాజీ సోదరుడు సూర్యాజీ కోట ముఖద్వారంపైన దాడి చేసాడు. మారాఠాలకు రాజపుత్రులకు జరిగిన భీకరపోరులో మరాఠాలు గెలిచినా తానాజీ మరణించాడు. ఈ వార్త విన్న శివాజీ 'కోటను గెలిచాము కానీ సింహాన్ని పోగొట్టుకొన్నాము ' అన్నాడు. సింహంవలె పోరాడిన తానాజీ గౌరవార్థం కొండన కోట పేరును సింహఘడ్‌గా మార్చాడు.జూన్ 6, 1674న రాయఘడ్ కోటలో వేద పఠనాల మధ్య శివాజీని క్షత్రియరాజులందరికీఅధిపతిగా కీర్తిస్తూ 'ఛత్రపతి ' అని బిరుదును ప్రదానం చేసారు. కొన్నాళ్ళకు 50,000 బలగంతో దక్షిణ రాష్ట్రాల దండయాత్రచేసి వెల్లూరు, గింగీలను సొంతం చేసుకున్నాడు. 27 ఏళ్ళపాటు యుద్ధాలలో గడిపి హిందూ రాజులకు ఆదర్శంగా నిలిచి సువిశాల మరాఠా సామ్రాజ్యాన్ని నెలకొల్పిన ఛత్రపతి శివాజీ మూడు వారాలు తీవ్ర జ్వరంతో బాధపడి ఏప్రిల్ 3, 1680 న మధ్యాహ్నం 12 గడియలకు రాయఘడ్ కోటలో మరణించాడు.శివాజీ పెద్దకొడుకయిన శంభాజీ తర్వాత రాజ్యాన్ని చేపట్టి మొఘలులను సమర్థవంతంగా ఎదుర్కొని పరిపాలించాడు.

**పరిపాలనా విధానం....**యుద్ధతంత్రాలలో మాత్రమే కాకుండా పరిపాలనా విధానంలో కూడా శివాజీ భారతదేశ రాజులలో అగ్రగణ్యుడు. మంత్రిమండలి, విదేశాంగ విధానం, పటిష్ఠమయిన గూఢచారి వ్యవస్థ ఏర్పాటు చేసాడు. ప్రజలకోసమే ప్రభువు అన్న సూత్రం పాటించి, వ్యక్తిగత విలాసాలకు ఎటువంటి వ్యయం చేయక ప్రజల సంక్షేమం కోసమే పాటు పడ్డాడు.వ్యక్తిత్వం

సుదీర్ఘ యుద్ధ కాలంలో లెక్కలేనన్ని యుద్ధాలు చేసినా ఎన్నడూ పవిత్రస్థలాలను ధ్వంసం చేయలేదు. యుద్ధంలో ఓడిపోయిన శత్రువుల రాజ్యంలో ఉన్న యుద్ధం చేయలేనివారికి, స్త్రీలకు, పసివారికి సహాయం చేసాడు.ఒకసారి శివాజీ సైనికాధికారి ఒక చిన్న ముస్లిం రాజును ఓడించి అతడి అందమయిన కోడలును తీసుకొచ్చి శివాజీ ముందు ప్రవేశపెట్టాడు. శివాజీ ఆమెతో "నా తల్లి కూడా మీ అంత అందమయినది అయిఉంటే నేను కూడా అందంగా ఉండేవాడిని" అంటూ ఆమెను తల్లిలా గౌరవించి కానుకలతో ఆమె రాజ్యానికి పంపించాడు. శివాజీ లౌకిక పాలకుడు. శివాజీ అన్ని మతాలకు అనుకూలంగా ఉండి, అన్ని మతాల ప్రజలను బాగా చూసుకునేవాడు. ముస్లింలకు వ్యతిరేకంగా అనేక తిరుగుబాట్లు చేసినప్పటికీ ఆయన పాలనలో ముస్లింలు తగిన విదంగా గౌరవించబడ్డారు.అనేక మసీద్ లు నిర్మించిన హిందూ పాలకుడు.మనువాద%శీ% అమలులో లేదు.

%నిస్వార్థంగా ప్రజలకు సేవచేయడం, తాను చేస్తున్న పనిపట్ల అంకితభావం, మచ్చలేని వ్యక్తిత్వం ఆయన అనుచరులకు, ప్రజలకు ఆదర్శంగా నిలిచాయి. భారతదేశాన్ని ఎందరో రాజులో ఏలినప్పటికీ ఈ లక్షణాలే శివాజీని గొప్పరాజుగా చేసాయి.

సైన్యంమరాఠా సామ్రాజ్యం ముగిసేవరకు శివాజీ ఏర్పాటు చేసిన సైనిక వ్యవస్థ నిలిచి ఉండేది.పటిష్ఠమయిన నౌకా దళాన్ని, ఆశ్వికదళాన్ని ఏర్పాటు చేసాడు. ఎనిమిది నెలలు పంటలు పండించే రైతులు కూడా నాలుగు నెలలు యుద్ధ నైపుణ్యాలను నేర్చుకోవడం శివాజీ విధానాలను అద్దం పడుతుంది. కేవలం సైనికులే కాక సంఘంలోని అన్ని వర్గాలవారు కోటను పరిరక్షించేవారు. మరణించే నాటికి శత్రువులందరూ వెనుకాడే విధంగా లక్ష సైన్యాన్ని తయారు చేసిన సమర్థుడు శివాజీ.

కోటలు మరణించేనాటికి 300 కోటలు శివాజీ ఆధీనంలో ఉండేవి. కొండలపైన ఉన్నత సాంకేతిక విలువలతో దుర్భేధ్యమయిన కోటలను నిర్మింపచేయడంలో శివాజీ ప్రపంచ ఖ్యాతి పొందాడు. నాసిక్ నుండి మద్రాసు దగ్గర ఉన్న జింగీ వరకు 1200 కిలోమీటర్ల మధ్య ఈ 300 కోటలు నిర్మించబడ్డాయి.మతసామరస్యం శివాజీ భవానిదేవి భక్తుడు. శివాజీ తన సామ్రాజ్యంలోని అన్ని మతాలను సమానంగా చూసేవాడు. కేవలం గుళ్ళు మాత్రమే కాకుండా ఎన్నో మసీదులు కట్టించాడు. శివాజీ సైన్యంలో మూడొంతులు ముస్లిములు. ఎందరో ముస్లిములు ఉన్నత పదవులు నిర్వహించారు. హైదర్ ఆలీ ఆయుధాల విభాగానికి, ఇబ్రహీం ఖాన్ నావికాదళానికి, సిద్ది ఇబ్రహీం మందుగుండు విభాగానికి అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహించారు. శివాజీకి సర్వ సైన్యాధ్యక్షులు దౌలత్ ఖాన్, సిద్ధిక్ అనే ఇద్దరు ముస్లింలు! శివాజీ అంగ రక్షకులలో అతిముఖ్యుడూ, అగ్రా నుంచి శివాజీ తప్పించుకోటానికి సహాయపడిన వ్యక్తి మదానీ మెహ్తర్ కూడా ముస్లిమే!

## తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సేవలో బాసర యువత



**బాసర (మనవెలుగు) ఫిబ్రవరి 18 :** సేవ చేయడం ద్వారా ధర్మబద్ధమైన జీవితాన్ని గడపడానికి శ్రీవారి సేవ ఉత్తమ మార్గమని యువత ముందుకు వచ్చి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలోని భక్తుల సేవలో పాల్గొన్నారు.నిర్మల్ జిల్లా బాసర గ్రామానికి చెందిన 10మంది యువకులు కలసి శ్రీవారి దర్శనం కోసం క్యూలైన్ లో వేచి ఉన్న భక్తులకు సేవలు చేసేందుకు విడతలవారీగా విధులు నిర్వహిస్తున్నారు.టిటిడి అందిస్తున్న ఈ గొప్ప సేవ అవకాశం కలియుగంలో సేవ ద్వారా మాత్రమే దేవుడిని ప్రసన్నం చేసుకుని మోక్షాన్ని పొందవచ్చుని,శ్రీవారి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కాలగకుండా వారికి మంచినీరు,పాలు మజ్జిగ,బిస్కెట్లు,పండ్లు,సూచనలు,సలహాలు భక్తులకు అందిస్తున్నమని సాయిరాం,నరేష్, నాగేష్,నారాయణ, తేజ,ఋషికేష్,సతీష్ ఆకాష్,శ్రీవర్ధన్ తెలిపారు.

## ఘనంగా జగదాంబ దేవి మందిర ప్రారంభోత్సవం



**ముధోల్ (మన వెలుగు) ఫిబ్రవరి 18:** ముధోల్ మండలం తరోడ గ్రామపంచాయతీ పరిధిలోని అనుబంధ గ్రామమైన తరోడ తండాలో తండా వాసుల ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీ జగదాంబ దేవి మందిరం తో పాటు సేవాలాల్ మహారాజ్ మందిరాన్ని ప్రారంభించారు. మందిర ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి, మాజీ జడ్పిటిసి లక్ష్మి నర్సాగౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ రాజేష్ బాబు, మాజీ సర్పంచులు నరేందర్ రాథోడ్, ఆరిపుద్దీన్, శ్వేతా రవి కిరణ్ గౌడ్ హాజరయ్యారు. తండావాసులు ఆధ్వర్యంలో ముఖ్య అతిథులకు శాలువతో సన్మానించారు. సాంప్రదాయపద్ధంగా ఉత్సవాలు నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో తండా నాయకులు, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

TEL:T/TG/2024/0814
మన వెలుగు
ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక
MANA VELUGU TELUGU DAILY



# పట్టుదలతో శ్రమిస్తే విజయం సొంతం

## - ట్రస్ట్ చైర్మెన్ భోస్లే మోహన్ రావ్ పటేల్



**ముధోల్ (మన వెలుగు) ఫిబ్రవరి 18 :** పట్టుదలతో శ్రమిస్తే విజయం సొంతం అవుతుందని ప్రజా ట్రస్ట్ చైర్మన్ మోహన్ రావు పటేల్ అన్నారు. ముధోల్ మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల-జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల (ఉర్దూ), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల- కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం-తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల- తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల-మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్- మహాత్మాజ్యోతి బాపులే గురుకుల పాఠశాల-రవీంద్ర హైస్కూల్-శ్రీ సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న ప్రభుత్వ- ప్రవేట్ పాఠశాలల విద్యార్థిని-విద్యార్థులకు మోహన్ రావ్ పటేల్ ప్రజా ట్రస్ట్ తరుపున ట్రస్ట్ చైర్మెన్ మోహన్ రావ్ పటేల్ గ్రామస్థుల సమక్షంలో ఎగ్జామ్ ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మోహన్ రావ్ పటేల్ మాట్లాడుతూ నిరుపేద విద్యార్థుల చదువుకు అండగా నిలవాలనే ఉద్దేశంతో మోహన్ రావ్ పటేల్ ప్రజా ట్రస్ట్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పదవ తరగతి విద్యార్థులు ఒత్తిడిని జయిస్తూ విజయం సాధించాలని, తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. చదివేమెళకువలు,అనుసరించాల్సిన విధానంపై వివరించారు. కష్టపడి చదివితే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరాలని, ప్రతి ఒక్కరికి ఆల్ ది బెస్ట్ చెప్పారు. విద్యార్థులు పాఠశాల అధ్యాపకులు మోహన్ రావ్ పటేల్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, పాఠశాల అధ్యాపకులు, ట్రస్ట్ టీం సభ్యులు ముధోల్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హైదరాబాద్ లో కాలుష్యాన్ని తగ్గించడానికి ఈవీ పాలసీ తీసుకొచ్చాం ఈవీ వాహనాలను ప్రజలు ప్రోత్సహించాలి



**కూకట్పల్లి (మనవెలుగు) ఫిబ్రవరి 18:** రాష్ట్ర ప్రభుత్వ పాలసీలు, ఉదారత నిర్ణయాలతో రాష్టంలో ఈవీ వాహన యుగం రాబోతుంది టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం. న్యూ బోయిన్ పల్లిలోని నెక్స షోరూంలో ఈ వితారా ఎంసీల్ ' ఎస్ ఫస్ట్ ఎలక్ట్రిక్ కార్ ను ఆవిష్కరించిన టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం, జనరల్ మేనేజర్ సురేష్ బాబు, సీఈఓ హరేరామ సింగ్, సీనియర్ మేనేజర్ రమణ రెడ్డి, రీజినల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త ఈవీ పాలసీ వాహనదారుల్ని ఆకర్షిస్తుండడంతో కార్లు, ఆటోలు, మోటార్ సైకిళ్ళ కొనుగోలు క్రమంగా పెరుగుతోందని, పెట్రోల్, డీజీల్ తో నడిచే వాహనాల వల్ల కాలుష్యం పెరుగుతోందంటూ రాష్ట్ర ప్రభుత్వం ఈవీ కొత్త పాలసీ విధానాన్ని అముల్లోకి తెచ్చిందని అన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రోడ్ టాక్స్ తో పాటు రిజిస్ట్రేషన్ చార్జీలను తగ్గిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌ను కాలుష్య రహితంగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని డీజిల్ వాహనాల స్థానంలో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రవేశపెట్టనుంది. ఆదాయం కంటే హైదరాబాద్‌లో నివసించే ప్రజల ఆరోగ్యమే ముఖ్యమని, హైదరాబాద్‌ను గ్రీన్ సిటీగా మార్చేందుకు పలు విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటున్నారని, కాలుష్యం కారణంగా ఢిల్లీ ప్రజలు ఇప్పటికే అనేక ఇబ్బందులు పడుతున్నారని సమస్య చాలా తీవ్రంగా మారిందని, హైదరాబాద్‌లో అలాంటి పరిస్థితి రాకుండా తెలంగాణ ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోంది అని తెలిపారు. తెలంగాణ ఎలా అభివృద్ధి చెందుతుందో, రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాలు, విధానాలు తీసుకుంటుందో ప్రపంచ వ్యాప్తంగా అందరూ ఆసక్తిగా గమనిస్తున్నారు. ఎలక్ట్రిక్ వాహనాల స్వీకరణను ప్రోత్సహించడానికి అనేక ప్రాంతాలలో ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ రాజ్ పుత్, హేమంత్, గజానంద్ శేఖర్, రాము గౌడ్ నెక్స షో రూమ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గండి హనుమాన్ వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు



**ఇబ్రహీంపట్నం (మన వెలుగు) ఫిబ్రవరి 18 :** తెలంగాణ రాష్ట్రంలో అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో, జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని గండి హనుమాన్ వద్ద పోలీసు మరియు రెవెన్యూ శాఖలు చెక్‌పోస్టును ఏర్పాటు చేశాయి. ఈ చెక్‌పోస్టు ద్వారా ఇసుక అక్రమ రవాణాను నిరోధించేందుకు 24 గంటల పాటు కఠినంగా పర్యవేక్షణ జరుగుతోంది మరియు అక్రమ రవాణా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ అనిల్ తెలిపారు.

# దొంగతనానికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్




**ఇబ్రహీంపట్నం (మన వెలుగు) ఫిబ్రవరి 18 :** మేడిపల్లి గ్రామ శివారులోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో దొంగతనానికి పాల్పడిన తూర్పాటి కనకయ్య (32) అనే నిందితుడు ఇబ్రహీంపట్నం క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో అక్కడ అనుమానా స్పదంగా తిరుగుతున్న అతనిని అదుపులోకి తీసుకొని విచారించగా మేడిపల్లి గ్రామ శివారులో గల దేవాలయంలో రెండు నెలల క్రితం దొంగతనం చేసినట్టు ఒప్పుకున్నాడు. గతంలో వివిధ పోలీస్ స్టేషన్లో పరిధిలోని దేవాలయాలలో దొంగతనానికి పాల్పడి జైలుకు వెళ్లి వచ్చాడు.కనకయ్యను అరెస్టు రిమాండ్ కు తరలిస్తున్నట్లు ఎస్ఐ అనిల్ తెలిపారు.

# ఢిల్లీలో ప్రకంపనలు.. బీహార్‌లో మరో భూకంపం

**న్యూఢిల్లీ :** ఉత్తరాదిన వరుస భూకంపాలు సంభవించాయి. సోమవారం తెల్లవారు జామున ఢిల్లీ , పరిసర ప్రాంతాల్లో ప్రకంపనలు చోటు చేసుకోగా, ఆ తర్వాత కొన్ని గంటల వ్యవధి లోనే బీహార్ రాష్ట్రంలో మరోసారి భూకంపం సంభవించింది. మొదట సోమవారం తెల్లవారు జామున 5.35 గంటల సమయంలో ఢిల్లీ, నోయిడా, గురుగ్రామ్ , గాజియాబాద్ , నేషనల్ క్యాపిటల్ రీజియన్ (ఎన్‌సిఆర్) ప్రాంతాల్లో 4.0 తీవ్రతతో భూకంపం సంభవించింది. ధౌలాకాన్ లోని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ కాలేజీ సమీపంలో 5 కిలో మీటర్ల లోతున భూకంపం కేంద్రం ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ఢిల్లీలో కొన్ని సెకన్ల పాటు భూమి తీవ్రంగా కంపించడంతోపాటు భారీ శబ్దం వినిపించినట్టు కొందరు చెబుతున్నారు. అపార్టుమెంట్లు, విద్యుత్ స్తంభాలు ఊగిపోయాయని పేర్కొన్నారు. దీంతో ప్రజలు భయాందోళనలతో బయటకు పరుగులు తీశారు. ఢిల్లీలో భూకంపం సంభవించిన గంటల వ్యవధి లోనే బీహార్ రాష్ట్రంలో మరో భూకంపం సంభవించింది. బీహార్ లోని సివాన్ జిల్లాలో సోమవారం ఉదయం 8.02 గంటల ప్రాంతంలో ప్రకంపనలు వచ్చాయి. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 4.0 గా నమోదైనట్టు అధికారులు వెల్లడించారు. సివాన్‌లో 10 కిమీ లోతున భూకంపం కేంద్రం ఉన్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా బీహార్ ప్రకృతి వైపరీత్య నిర్వహణ విభాగం అడిషనల్ చీఫ్ సెక్రటరీ ప్రత్యాయ అమృత్ ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టాలు జరిగినట్టు ఇంతవరకు సమాచారం లేదన్నారు.

# కూకట్ పల్లి టియూడబ్ల్యుజే యూనియన్‌లో ఒంటెద్దు పోకడ

### - సభ్యులకు తెలియకుండా కమిటీ ఏర్పాటు
### - నూతన కార్యవర్గాన్ని చూసి కంగుతిన్న యూనియన్ జర్నలిస్టులు
### - కార్యవర్గ సమావేశం లేకుండానే నూతన కమిటీ నియామకం



**కూకట్ పల్లి (మన వెలుగు) ఫిబ్రవరి 18:** తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర కమిటీ ప్రకటించిందంటూ, పలువురు సభ్యులు ప్రచారాలు చేయడం పట్ల యూనియన్ సభ్యులు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఈ మేరకు నియామక పత్రాన్ని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ , ప్రధాన కార్యదర్శి ఏ.మారుతి సాగర్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్కే దయాసాగర్ కి అందజేయడంతో యూనియన్ కి సంబంధించి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని కూకట్పల్లి విలేకరులు తెలియజేశారు.

**సభ్యులకు సమాచారం ఇవ్వకుండా....** కూకట్ పల్లి యూనియన్ కు సంబంధించి సభ్యులుగా ఉన్న వారికి ఎలాంటి సమాచారం లేకుండా నలుగురు కలిసి రాష్ట్ర నేతలను కలిసి ఏకగ్రీవంగా ఎన్నికయ్యామని తెలియజేయడం పట్ల ఆంతర్యం ఏమిటి అని యూనియన్ సభ్యులు ప్రశ్నిస్తున్నారు. కూకట్ పల్లి లో పనిచేసే ప్రతి విలేకరులకు సమాచారం ఇవ్వడంతోపాటు యూనియన్ తరపున మీటింగ్ ఏర్పాటు చేసి అందులో పోటీ చేసిన వారికి మాత్రమే పదవులను కేటాయించాలని రాష్ట్ర నాయకత్వాన్ని యూనియన్ సభ్యులు డిమాండ్ చేశారు .

**వారం రోజుల్లో నూతన కమిటీ నియామకం...** టి యు డబ్ల్యూ జే రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ ని కూకట్ పల్లి యూనియన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి యూనియన్ లో జరుగుతున్న పలు అంశాలను వారికి వివరించారు. కొంతమంది యూనియన్ సభ్యులు మోసపూరితంగా వ్యవహరించి తాము ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన నాయకులం అంటూ రాష్ట్ర నాయకుల వద్దకు వచ్చి నియామక పత్రాలు అందుకున్నారని వీటి పైన వెంటనే విచారణ జరిపించాలని యూనియన్ సభ్యులు అలం నారాయణ ని కోరారు. దీనిపైన స్పందించిన ఆయన యూనియన్ వ్యవహారానికి సంబంధించి త్వరలోనే నూతన కమిటీ ఏర్పాటుకు తానే ముందుకు వస్తానని తెలియజేసినట్లు వారు ప్రకటించారు. వారం రోజుల్లో కూకట్ పల్లి నియోజకవర్గానికి సంబంధించి నూతన కార్యవర్గ నియామకంతో పాటు ప్రతి సభ్యుడుతో తాను చర్చించిన తర్వాతే నిర్ణయాన్ని ప్రకటిస్తామని ఈ సందర్భంగా వెల్లడించారు. ప్రస్తుతం ఎవరైతే కమిటీ నాయకులుగా ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యామని చెప్తున్నారు వాటిని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.ఇటీవల యూనియన్ కు సంబంధించి తాము అధ్యక్షులుగా ఎన్నికయ్యామంటూ నియామక పత్రం అందుకున్న వాటిని రద్దుచేసి అందరి సమక్షంలో ఎన్నికలు జరపాలని కూకట్ పల్లి విలేకరులు తెలియజేయడంతో వెంటనే ఎన్నికలు పెడతానని అల్లం నారాయణ ప్రకటించారు . యూనియన్ విషయంలో ఎటువంటి ప్రచారాలు నమ్మవద్దని త్వరలోనే నూతన కమిటీ నియామకం జరుగుతుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆనందరావు, నగేష్, బొమ్మ గోపి, చంద్రకాంత్, షబ్బీర్, నాగమణి, అంజిబాబు, ఉపేందర్, చంద్రకాంత్ రెడ్డి, నాగరాజు, రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

# రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



**మెట్ పల్లి (మన వెలుగు) ఫిబ్రవరి 18 :** మల్లాపూర్ మండలంలోని సాతారాం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకోవడం జరిగిందని మెట్పల్లి సిఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. ఇందులో ఒకటి పట్టణ శివారులోని రైల్వే బ్రిడ్జి వద్ద, మరొకటి వెంపేటలో పట్టుకున్నట్లు సిఐ తెలిపారు. యజమానులు ప్రశాంత్, అర్ష మురళి, డ్రైవర్ బాలయ్య ల పై మెట్పల్లి ఎస్ ఐ కిరణ్ కుమార్ కేసు నమోదు చేసినట్లు,తదుపరి చర్యల నిమిత్తం ఇసుకను తహసీల్దార్ కు,ట్రాక్టర్, యజమానుల పై చర్యల నిమిత్తం కోర్ట్ కు పంపినట్లు సిఐ తెలిపారు. మెటుపల్లి సర్కిల్ పరిధిలో అక్రమంగా ఇసుక రవాణా చేయడం ట్రాక్టర్, లారీల యజమానులు మానుకోవాలి. లేకుంటే కఠిన చర్యలు ఎదుర్కోవలసి ఉంటుందని సీఐ నిరంజన్ రెడ్డి తేలిపారు

# ఇజ్రాయెల్ డ్రోన్ దాడిలో హమాస్ అధినేత హతం

దక్షిణ లెబనాన్‌లో మిలిటెంట్ హమాస్ అధినేత సోమవారం తమ డ్రోన్ దాడిలో హతమయ్యాడని ఇజ్రాయెల్ మిలిటరీ వెల్లడించింది. కాల్పుల విరమణ ఒప్పందం ప్రకారం దక్షిణ లెబనాన్ నుంచి ఇజ్రాయెల్ పూర్తిగా తన సైన్యాన్ని ఉపసంహరించుకునే గడువు పూర్తి కావస్తున్న సందర్భంగా ఈ డ్రోన్ దాడి జరిగింది. లెబనాన్‌లో హమాస్ ఆపరేషన్స్ విభాగం హెడ్ మొహమ్మద్ షహీన్‌ను హతమార్చినట్టు ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. ఇరాన్ నిధుల సాయంతో లెబనీస్ భూభాగం నుంచి ఇజ్రాయెల్‌పౌరులపై దాడులకు పన్నాగం పన్నుతున్నాడని ఆరోపించింది. లెబనీస్ ఆర్మీ చెక్‌పాయింట్, సిడాన్స్ మున్సిపల్ స్పోర్ట్ స్టేడియం వద్ద ఒక కారు మంటల్లో దగ్ధమైపోతున్న దృశ్యం ఫుటేజీలో కనిపించింది. లెబనాన్ నుంచి ఇజ్రాయెల్ సైన్యాలు వైదొలగడానికి అసలు గడువు జనవరి కాగా, ఇజ్రాయెల్ ఒత్తిడి కారణంగా ఫిబ్రవరి 18 వరకు గడువు పొడిగించడానికి లెబనాన్ అంగీకరించింది. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ డ్రోన్ దాడి జరగడం గమనార్హం

# నూతన సిఇసిగా జ్ఞానేష్‌కుమార్

**న్యూఢిల్లీ :** భారత ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ (సిఇసి)గా జ్ఞానేష్ కుమార్‌ను నియమితులయ్యారు.ఈ మేరకు సోమవారం రాత్రి పొద్దుపోయిన తరువాత రాష్ట్రపతి ద్రౌపదిముర్ము గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆయనతోపాటు ఎన్నికల కమిషనర్‌గా వివేక్‌జోషిని నియమించారు. అంతకుముందు నూతన ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామకానికి సంబంధించి ప్రధాని మోడీ అధ్యక్షతన సమావేశం జరిగింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా నూతన కమిటీ నియామకం చేస్తున్నదని, సుప్రీంకోర్టులో తీర్పు వచ్చే వరకు ఓపిక పట్టాలని కాంగ్రెస్ పార్టీ కోరింది. అయినప్పటికీ నూతన సిఇసిగా జ్ఞానేష్ కుమార్ నియామకానికే కేంద్రం మొగ్గుచూపింది. 2029 జనవరి 26 వరకూ ఆయన సిఇసిగా కొనసాగనున్నారు. ప్రస్తుత సిఇసి రాజీవ్ కుమార్ పదవీ కాలం మంగళవారంతో ముగియనుంది. జ్ఞానేష్‌కుమార్ కేరళ కేడర్‌కు చెందిన 1989 బ్యాచ్ ఐఎఎస్ అధికారి. అంతకుముందు ఆయన హోం మంత్రి అమిత్‌షా ఆధ్వర్యంలోని సహకార, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వశాఖల కార్యదర్శిగా పనిచేసి, పదవీ విరమణ పొందారు. శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్‌తోసహా అయోధ్య కేసుపై సుప్రీంకోర్టు తీర్పునకు సంబంధించిన విషయాలను చూసేందుకు హోం మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగానికి ఆయన నేతృత్వం వహించారు.